క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న ఏడీసీ సుధాకర్

కాకినాడ: ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి గంట సేపు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్‌కు 9 మంది వివిధ సమస్యలను ఫోన్‌లో వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు సుమారు 50 మంది ఏడీసీకి ఫిర్యాదులు అందజేశారు. ఆయా సమస్యలకు సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను నిర్దేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు.

ఫాగింగ్ కోసం...

దోమలను నియంత్రించేందుకు ఫాగింగ్ చేయాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, వెంకట్ ఆధ్వర్యంలో స్థానికులు ఏడీసీకి వినతిపత్రం అందజేశారు. తక్షణమే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన హారతి

బోట్‌క్లబ్: కార్తిక మాసంలో వనపూజ, వన హారతి, వన భోజన సంస్కృతిని పూర్వీకులు అందించారని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా స్థానిక జవహర్ వీధిలోని వివేకానంద ఉద్యానవనంలో ఉన్న ఉసిరిచెట్టు వద్ద ఉసిరికాయలతో రూపొందించిన శివలింగ స్వరూపానికి ప్రత్యేక పూజలు చేశారు. వన హారతితో ప్రత్యేక కార్యక్రమాన్ని శ్రీవారి సేవకులతో ఘనంగా నిర్వహించారు. ఆవు పాలతో స్ఫటిక శివలింగాన్ని అభిషేకించి, మంగళ హారతులు అందించారు.

నేడు క్షీరాబ్ది ఏకాదశి పూజలు

బోట్‌క్లబ్: క్షీరాబ్ది ఏకాదశి సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో యర్రా వేంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఆలయంలో సహస్ర దీపాలంకరణ, స్వామివారికి ద్వాదశ ప్రదక్షిణలు, అర్చన జరుగుతాయని వివరించారు. స్వామివారు మహావిష్ణు అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

17న ఉచిత వైద్య శిబిరం

బోట్‌క్లబ్: లయన్స్ క్లబ్ జెమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 17న వార్పు రోడ్డులోని పగోడ మున్సిపల్ స్కూల్‌లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ మాజీ గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరానికి హాజరయ్యే వారికి రమణ క్లినికల్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఉచితంగా సుగర్, బీపీ పరీక్షలు చేస్తారని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు రోగులను పరీక్షించి, వారికి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్యాంక్ సేవలు విస్తరించాలి

కాకినాడ సిటీ: యూనియన్ బ్యాంకు సేవలు మరింత విస్తృతం చేయాలని డీఆర్వో కె వెంకట్రావు, సీపీవో త్రినాథ్, ఐడియల్ విద్యాసంస్థల చైర్మన్ పి.చిరంజీవినికుమారి అన్నారు. బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం కలెక్టరేట్ బ్యాంక్ శాఖలో సోమవారం జరిగింది. మేనేజర్ సురేష్‌కుమార్, శివకుమార్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గురజనాపల్లిలో గ్రామ సభ

కరప: మండలంలోని గురజనాపల్లిలో సోమవారం రెవెన్యూ అధికారులు రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రైతులు తమ భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా దరఖాస్తు చేసుకుంటే, రైతుల సమక్షంలోనే రీ సర్వే చేసి, పరిష్కరిస్తారని వివరించారు. పట్టాదార్ పాసు పుస్తకాలకు, భూ విస్తీర్ణంలో వ్యత్యాసాలపై, పేరు మార్పులు, సర్వే నంబర్ల సబ్ డివిజన్ కోసం 18 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. మండల సర్వేయర్ ఎస్.రూపవతి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్, ఆర్ఐ పవన్, వీఆర్వో జె.కాంతాశ్రీ పాల్గొన్నారు.

డిసెంబర్ 3న క్రిస్మస్ వేడుకలు

కరప: వేళంగిలోని క్రైస్ట్ చాపల్ చర్చిలో డిసెంబర్ 3న మండల పాస్టర్ల ఫెలోషిప్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు జరుగుతాయని సంఘ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.సత్య ప్రసాదబాబు తెలిపారు. వేళంగి సమీపంలోని నరసాపురంలోని రెవరెండ్ ఎం.ప్రేమ్ చర్చిలో సోమవారం జరిగిన మండల పాస్టర్ల ఫెలోషిప్ సహవాస కార్యక్రమం జరిగింది. పోస్టర్లను సంఘ చైర్మన్ డాక్టర్ స్టీఫెన్‌బాబు కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా పాస్టర్ల ఫెలోషిప్ కమిటీలో బాధ్యతలు స్వీకరించిన వైస్ ప్రెసిడెంట్ రెవ. ఐ.జాన్ సూర్యప్రకాష్, సలహాదారు డాక్టర్ స్టీఫెన్‌బాబు, రీజనల్ మెంబర్లు రెవ పి.సమాధానం, సీహెచ్ సురేందర్‌ను ఘనంగా సత్కరించారు.

గండం నుంచి గట్టెక్కేనా!?

- కోతల వేళ వాతావరణ శాఖ తుపాను హెచ్చరికలు
- మారిన వాతావరణంతో ఖరీఫ్ రైతుల్లో ఆందోళన
- ప్రస్తుత సీజన్‌లో సాగుబడి కంటే ప్రకృతితోనే పోరు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వ్యవసాయ నిపుణులు



కాకినాడ రూరల్ పి.వెంకటాపురంలో వరి చేలు



పి.వెంకటాపురంలో వరి కోత యంత్రంతో ఒబ్బిడి చేస్తున్న ధాన్యం

కాకినాడ రూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజల్‌లో చుక్కాని లేని నావలా తయారైంది రైతన్నల పరిస్థితి. ఎప్పుడు తుపాను వస్తుందో తెలియక అన్నదాతలు నిత్యం ఆందోళన చెందుతున్నారు. వరి సాగు కోసం నాట్లు వేసిన నాటి నుంచి తుపాన్లతోనే రైతన్నలు పోరు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. జూలై, సెప్టెంబర్, అక్టోబర్‌లో తుపాన్లు, అధిక వర్షాలతో రైతులు చాలా వరకు నష్టపోయారు. నవంబర్ రెండో వారం నుంచి కోతలు ప్రారంభించి, పంటను ఒబ్బిడి చేసుకోవచ్చని ఆశలు పెట్టుకుని మసూళ్లు ప్రారంభించిన రైతన్నలకు.. వాతావరణ శాఖ ప్రకటన కునుకులేకుండా చేస్తోంది.

వాతావరణ మార్పులు

మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. సోమవారం ఉదయం నుంచి ఎండగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశమంతా మేఘావృతంగా మారింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రబీ విత్తనాల కోసం కొందరు రైతులు వరిచేలు కోతలు ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా అందుబాటులోకి రావడంతో, తిమ్మాపురం, పి.వెంకటాపురం, కరప తదితర చోట్ల వరి కోత యంత్రాలతో మసూళ్లు ప్రారంభమయ్యాయి.

వర్షాలు వస్తే నష్టమే..

ప్రస్తుతం వరిచేలు గింజలు తోడుకుని కోతకు సిద్ధమయ్యే దశలో ఉన్నాయి. ముందుగా నాట్లు వేసిన, వెదజల్లు ద్వారా సాగు చేపట్టిన పొలాల్లో చేలు కోతలకు సిద్ధంగా ఉన్నాయి. మరో వారం రోజుల్లో దాదాపుగా అన్ని చోట్లా కోతలకు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధిక వర్షాలు పడితే ఆ ప్రభావం రైతులపై తీవ్రంగా ఉంటుంది. వర్షాల వలన వరిచేలు నేలను తాకడం, గింజలు రాలిపోవడంతో పాటు, తడిసిన ధాన్యం రంగు మారడం వంటివి జరుగుతాయి. దిగుబడిపైన ప్రభావం పడుతుంది.

సాగు తీరిలా..

నియోజవర్గంలో కాకినాడ రూరల్, కరప మండలాల్లో సుమారు 19100 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎక్కువ మంది రైతులు ఎంటీయూ 7029(స్వర్ణ) రకం వరి వంగడం 60 శాతం ఆయకట్టులో సాగు చేపట్టగా, పది శాతం బీపీటీ 5204, మరో పది శాతం ఎంటీయూ 1318 రకం , 20 శాతం ప్రైవేట్ వరి వంగడాలు సాగు చేస్తున్నారు. తుపాన్ల కారణంగా తరచూ వరిచేలు ముంపునకు గురవ్వడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడుతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పుడు మరోసారి వానలు కురిస్తే.. పంట కోత సమయంలో ఇబ్బందికరమని పండూరుకు చెందిన రైతు నందిపాటి ధర్మరాజు తెలిపారు. మరో వైపు సీజన్ ముగింపు దశలో ఉన్నా, పెట్టుబడి సాయం ఇంకా అందించకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

> ఖరీఫ్ వరిచేలు కోతలకు సిద్ధమయ్యాయి. వాతావరణ శాఖ మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని తెలియజేయడంతో రైతులు వరి చేల కోతలపై అప్రమత్తంగా ఉండాలి. రెండు, మూడు రోజుల తరువాత మసూళ్లు ప్రారంభిస్తే మంచిది, ధాన్యం కొనుగోలుకు మద్దతు ధరను కామన్ రకం 75 కేజీల బస్తాకు రూ.1,725, సన్న రకానికి రూ.1,740 ప్రభుత్వం నిర్ణయించింది.
>
> – చీకట్ల సత్యనారాయణ, వ్యవసాయాధికారి, కాకినాడ రూరల్

కలెక్టరేట్ వద్ద యానిమేటర్ల ధర్నా



ధర్నా చేస్తున్న కాకినాడ రూరల్ మండల యానిమేటర్లు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలంలో తొలగించిన యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అపర్ణ, రమణమ్మ మాట్లాడుతూ, గత 15 ఏళ్లుగా పని చేస్తున్నామని, గత రెండేళ్ల క్రితం తాము గ్రామాల్లో లబ్ధిదారులకు రుణాలు ఇప్పించినందుకు అధికారులు కక్షకట్టి 10 మంది యానిమేటర్లను అక్రమంగా విధుల నుంచి తొలగించారన్నారు. తాము ఏ తప్పు చేయకపోయినా.. ఉద్దేశపూర్వకంగా కుల వివక్షతో గత రెండేళ్ల క్రితం తొలగించారన్నారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కేవలం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలైన యానిమేటర్లను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. దీనిపై అధికారులకు మొరపెట్టుకోగా, తమను ఎన్నికలకు మూడు నెలల ముందు గ్రామ సంఘాల ఆమోదంతో విధుల్లోకి తీసుకున్నారన్నారు. తాము డీఆర్‌డీఏ పీడీని కలిసి, జీతాల కోసం అడిగితే.. మిమ్మల్ని విధుల్లోకి తీసుకోలేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఏడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని వారు వాపోయారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌ను వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తొలగించిన యానిమేటర్లు కుమారి, రమాదేవి, లక్ష్మి, సత్య పాల్గొన్నారు.

ఆజాద్ సేవలు చిరస్మరణీయం



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్



విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్

కలెక్టర్ షణ్మోహన్ నివాళి

కాకినాడ సిటీ: స్వాతంత్య్ర సమరయోధుడిగా, దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ షణ్మోహన్ సగిలి కొనియాడారు. భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ షణ్మోహన్, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లాలోని ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయులను, ఇతర మత పెద్దలను కలెక్టర్ సత్కరించారు. ఉర్దూ వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలకు గుర్తుగా ఆయన పుట్టిన రోజును ప్రతి ఏటా జాతీయ విద్యా దినోత్సవంగా, మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. స్వరాజ్య పోరాటంలో గాంధీజీతో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొనడంతో పాటు, జైలు శిక్షను అనుభవించారన్నారు. హిందూ, ముస్లింల ఐక్యతకు కృషి చేయడంతో పాటు, మైనార్టీల విద్య, సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం సునీల్ కుమార్, డీఈఓ పి రమేష్, అడల్ట్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి వి.త్రిమూర్తులు, ముస్లిం ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ జవహర్ అలీ, ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు సయ్యద్ సాలార్, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు, మైనార్టీ సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఉమాశంకర గౌరీదేవి జాతర



నడకుదురులోని ఉమాశంకర గౌరీదేవి అమ్మవారు

కరప: నడకుదురులో ఆదివారం రాత్రి తెల్లవార్లూ ఉమాశంకర గౌరీదేవి జాతర మహోత్సవాన్ని గ్రామ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏడాది విడిచి ఏడాది కార్తిక మాసంలో ఈ సంబరాన్ని నిర్వహిస్తారు. ఉదయం ఉమాశంకర గౌరీదేవికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వెలమ సామాజిక వర్గం వారి ఆరాధ్య దేవత ఉమాశంకర గౌరీదేవి అమ్మవారికి గ్రామోత్సవం జరిపారు. గ్రామస్తులు అమ్మవారికి పొన్పులు వేసి, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని ప్రతి వీధిలో ట్రాక్టర్లపై భారీ లైటింగ్ ఏర్పాటు చేసి, పురాణ, ఇతిహాసాల్లోని సన్నివేశాలను ప్రదర్శించారు. ఆర్కెస్ట్రా, డీజే వంటి వివిధ కార్యక్రమాలతో రేయింబవళ్లు జాతర నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, ఎంపీటీసీ సభ్యురాలు పైలా రామతులసి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జవ్వాది సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు పైలా గోవిందు, గోమాడి ఏసుబాబు, పోతల లోవప్రసాద్, ఎడ్ల కృష్ణార్జున, యాసలపు గోవిందు, గూనూరు రామకృష్ణ, అల్లు శ్రీనివాస్ తదితరులు ఉమాశంకర గౌరీదేవిని దర్శించుకుని, పూజలు చేశారు. ఉత్సవ కమిటీ వారు, గ్రామ పెద్దలు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కరప ఎస్సై టి.సునీత, ఏఎస్సై వి.సూరిబాబు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కరప, పరిసర మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు, వివిధ పార్టీల నాయకులు తరలివచ్చి, ఉమాశంకర గౌరీదేవి జాతరను తిలకించారు.

దేశానికి ఆజాద్ సేవలు ఎనలేనివి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు



మౌలానా ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కన్నబాబు, వంగా గీత, ద్వారంపూడి తదితరులు

కాకినాడ: దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక డి కన్వెన్షన్‌లో మౌలానా ఆజాద్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితో పాటు, పలువురు నాయకులు, కార్యకర్తలు ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ, మౌలానా ఆజాద్ అందించిన సేవలకు గుర్తుగా భారత రత్న ఇచ్చి గౌరవించారన్నారు. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, విద్యా మంత్రిగా ఆజాద్ దేశానికి ఎనలేని సేవలందించారన్నారు. అలాంటి ప్రముఖులను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, జిల్లా కార్యదర్శి కరీమ్, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, జిల్లా ఐటీ సెల్ చైర్మన్ కృష్ణప్రియ, పెద్ద సంఖ్యలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దు బాబోయ్!

స్పందించని ఎక్సైజ్ శాఖ

కాకినాడ: నగరం నడిబొడ్డున బాలాజీచెరువు–టీటీడీ కల్యాణ మండపం వెనుక ప్రాంతంలో బ్రాందీ షాపును పెట్టొద్దంటూ స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. నివాసాల మధ్య ప్రతిపాదించిన ఈ వైన్‌షాపును తొలగించాలని కోరుతూ గతంలోనే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కలెక్టర్ షణ్మోహన్, ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు ఫిర్యాదులు ఇచ్చినా, ఇప్పటి వరకు ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతల ఆధ్వర్యంలో వంద మందికి పైగా స్థానికులు సమస్యను విన్నవించినా, ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే కొండబాబు దృష్టికి తీసుకెళ్లగా, ఎక్సైజ్ అధికారులకు సమస్య తెలియజేశారని, అయినప్పటికీ ఎక్సైజ్ అధికారుల నుంచి స్పందన లేదని వాపోయారు. తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక దీపోత్సవం



కార్తిక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కరప: మండల కేంద్రమైన కరపలో సోమవారం రాత్రి 20వ కార్తిక కోటి దీపోత్సవ మహోత్సవాన్ని భక్తి,శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఏటా కార్తిక మాసంలో రెండో సోమవారం దీపాల సంబరం జరపడం ఆనవాయితీగా వస్తోంది. కార్తిక దీపాల ఉత్సవ కమిటీ, భక్తుల విరాళాలతో ఈ సంబరాన్ని జరుపుతారు. మూడు రోజుల ముందు శివ, పార్వతులను నిలిపి పూజలు చేసి, వివిధ భజన బృందాలతో ఏకాహం నిర్వహించారు. సంబరం రోజున నాలుగు ఇన పరాడ్లతో అరపలను తయారు చేసి, అరలుగా చేసి, వాటిలో ప్రమిదలు పెట్టి, నూనె పోసి కార్తిక దీపాలు వెలిగిస్తారు. ఈ సందర్భంగా ఆర్కెస్ట్రా, గరగ నృత్యాలు, వినాయక, శివపార్వతుల వేషధారణ తదితర కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. అనంతరం బాణసంచా కాల్చారు. కరప, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, సంబరాన్ని తిలకించారు. ఎస్సై టి.సునీత సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

దానాలతో పుణ్య ఫలం

కాకినాడ రూరల్: కార్తిక మాసంలో దానాలు చేస్తే అత్యంత పుణ్య ఫలం లభిస్తుందని ఆధ్యాత్మికవేత్త డాక్టర్ శిరీష అన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్టు కార్యాలయంలో సోమవారం పోలీసు శాఖ ఉద్యోగి దిలీప్‌కుమార్ సౌజన్యంతో వృద్ధులకు నూతన వస్త్రాలు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

కాకినాడ సిటీ: ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని సీపీఎం జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జీ, నగర కన్వీనర్ పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాపోరు ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి స్థానిక 31వ డివిజన్ రాగంపేటలో వారు ప్రచారం నిర్వహించారు. నగరంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సేవలందిస్తున్నారని చెప్పారు. కనీసం వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో అక్రమంగా తొలగించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను హైకోర్టు ఉత్తర్వుల మేరకు విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న ఉదయం పది గంటలకు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, సీహెచ్ వేణు, ఎం నాగలక్ష్మి, విజయకుమార్ పాల్గొన్నారు.

నిందితులకు జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. సోమవారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా, 19 మందికి జైలు, 13 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

పోయినది

కాకినాడ రూరల్ మండలం, తూరంగి గ్రామం నివాసి అయిన సింగం వెంకట రవికృష్ణ గారు 21-09-2024 తేదీన కాకినాడ మున్సిపల్ జంక్షన్ నుండి తనకు సంబంధించిన పాస్‌పోర్ట్ జిరాక్స్ తీయించుకుని ఇంటికి వెళ్ళుచుండగా దారి మధ్యలో పాస్‌పోర్ట్ కనిపించకుండా పోయినది. PASS PORT No: F7412127 కావున ఎవరికైనా దొరికినచో యీ క్రింది నెంబరుకు తెలియచేయగలరు.

ఎస్.వి.రవికృష్ణ


సెల్ నెం.: 85550 34110, 88853 08948

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

- దర్శనాల కోసం పోటెత్తిన భక్తులు
- మార్మోగిన శివనామ స్మరణ



దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కరప శివాలయంలో పూజలందుకుంటున్న రామలింగేశ్వరస్వామి



భానులింగేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న పండితుడు

బోట్‌క్లబ్: కార్తిక మాసం రెండో సోమవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకుడు కొడమంచలి కార్తిక్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము మూడు గంటల నుంచి ఆలయంలో అభిషేకాలు నిర్వహించేందుకు భక్తులు రావడంతో, ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్థానిక భానులింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనం కోసం క్యూలు కట్టారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో వరపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు దర్శనకోసం క్యూలు కట్టారు. స్వామివారికి సుమారు ఐదు వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులు, అయ్యప్ప దీక్షాపరుల కోసం ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆలయానికి వచ్చిన భక్తులు ప్రసాదం పంపిణీ చేశారు. స్థానిక రామారావుపేటలోని శివాలయంలో భక్తులు దర్శనం కోసం క్యూలు కట్టారు. ఉచిత దర్శనంతో పాటు, రూ.10, రూ.20 దర్శనాలు ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం కోసం సుమారు గంట సేపు క్యూలో నిలబడాల్సి వచ్చింది. అలాగే జగన్నాథపురం, సాంబమూర్తినగర్‌లోని శివాలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కరప: మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. కార్తికమాసం రెండో సోమవారం శివనామ స్మరణతో మార్మోగాయి. హరహర మహాదేవ శంభో శంకరా అంటూ శివనామ స్మరణతో భక్తులు శివాలయాల్లో ప్రదక్షిణలు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు చేయించే భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామున 3.30 నుంచే అభిషేకాలు ప్రారంభమయ్యాయి. ప్రధానార్చకులు విలపర్తి శ్రీనివాస్, రాజు స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. విష్ణ్వాలయంలో అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ పూజాదికాలు నిర్వహించారు. ఆలయంలో మహిళలు, దంపతులు ఉసిరి, దీపం దానమిచ్చారు. కరపలో ఈఓ కె.తిరుమల రవితేజ, చినమామిడాడలోని పంచముఖేశ్వర స్వామి ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి, ఆయా గ్రామాల్లోని ఆలయ కమిటీ వారు భక్తులకు ఏర్పాట్లు చేశారు. పెనుగుదురు, అరట్లకట్ట, వేములవాడ, పెద్దాపురప్పాడు, వేళంగి, కొరిపల్లి, కూరాడ, గొర్రిపూడి, నడకుదురు, గురజనాపల్లి, వాకాడ తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తుల తాకిడి కనిపించింది.

శివాలయాల్లో భక్తుల సందడి

కాకినాడ రూరల్: అత్యంత పవిత్ర మాసంగా శివ కేశవుల పూజలందుకునే కార్తిక మాసంలో రెండో సోమవారం శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. కుంభాషేకం రేవు వద్ద ఆదికుంభేశ్వరుడు, నేమాంలో ఉమా రామలింగేశ్వరుడు, ఆర్టీసీ కాలనీ వద్ద త్ర్యంబకేశ్వరుడు, గోకుల్ గార్డెన్ వద్ద ఏకమ్రేశ్వరుడి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.